క్లుప్తంగా

అండర్‌పాస్ నిర్మాణానికి వినతి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని చింతారెడ్డిపాళెం సెంటర్ వద్ద జాతీయ రహదారిపై అండర్‌పాస్ నిర్మాణాన్ని చేపట్టాలని హైవే ప్రాజెక్ట్ డిప్యూటీ మేనేజర్ సుదాన్షీ కుమార్‌కు సీపీఎం నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఆ పార్టీ నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, 16వ డివిజన్ కార్యదర్శి కాయల శ్రీనివాసులు పాల్గొన్నారు.

పోరాటాల ఫలితంగానే జీఓ అమలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఆశా వర్కర్ల పోరాటాల ఫలితంగానే జీఓ నంబర్ 94 అమలు కానుందని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ అన్నారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం మాట్లాడారు. విజయలక్ష్మి, మధుసూదన, లక్ష్మి, రేణుక, కల్యాణి, అనూష, శిరీష పాల్గొన్నారు.

టీబీ నియంత్రణకు సహకరించాలి

నెల్లూరు(అర్బన్): జిల్లాలో టీబీ నియంత్రణకు ప్రైవేట్ ఆస్పత్రుల డాక్టర్లు సహకరించాలని జిల్లా టీబీ, లెప్రసీ, ఎయిడ్స్ నియంత్రణాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ అన్నారు. బుధవారం ఆయన నగరంలోని కిమ్స్, సైమ్రల్ తదితర ఆస్పత్రులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎవరికైనా టీబీ ఉన్నట్టు అనుమానిస్తే దగ్గరలోని ప్రభుత్వాస్పత్రికి పంపించాలన్నారు. తులసీరామ్, హరీష్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్, ఎల్‌పీఎస్‌పై వీడియో కాన్ఫరెన్స్

నెల్లూరు(బారకాసు): మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్, కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సంపత్ వివిధ అంశాలపై బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి కమిషనర్ నందన్, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు. పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి ఎల్ఆర్ఎస్, ఎల్‌పీఎస్ పథకాల అమలు, వర్షాకాలం నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కాలువల్లో పూడికతీత పనులు, ఇంటింటి చెత్త సేకరణ, ఆస్తి పన్నుల వసూలు, భవన నిర్మాణాల అనుమతులు, సర్వీస్ లెవెల్ ఇండికేటర్స్, పార్కుల ఏర్పాటు తదితర అంశాలపై ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కమిషనర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీలో యువత చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని బుధవారం యువకులు కలిసి స్వచ్ఛందంగా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువ నాయకుడు వంశీ ఆధ్వర్యంలో యువత పార్టీలో చేరడం అభినందనీయమన్నారు. వైఎస్సార్‌సీపీని రాష్ట్రంలో మరోసారి అధికారంలోకి తీసుకురావడమే ధ్యేయంగా కృషి చేద్దామన్నారు. సంక్షేమం, అభివృద్ధి పాలనను ప్రజలు కోరుకుంటున్నారని, వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేస్తామన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం ఉంటుందన్నారు. యువత రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాలను భరించలేక రాష్ట్రాభివృద్ధిని కాంక్షించి జగనన్న పార్టీలో చేరుతున్నట్లు చెప్పారు.

విద్యార్థులకు అవగాహన



నెల్లూరు(టౌన్): స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఐసీడీఎస్ పీడీ బి.హేనాసుజన్ హాజరై మాట్లాడారు. మన జిల్లాను మాదక ద్రవ్య రహితంగా మార్చేందుకు ధృడమైన నిర్ణయం తీసుకుందామన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణాధికారి సురేష్, ఏసీడీపీఓ అనురాధ, కళాశాల ప్రిన్సిపల్ గిరి, అధ్యాపకులు కళాప్రియ, ఐసీపీఎస్ అధికారి సమత తదితరులు పాల్గొన్నారు.

సామూహిక వరలక్ష్మీ వ్రతం రేపు

నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథ స్వామి దేవస్థానంలో 15వ తేదీ ఉదయం 10 గంటలకు సామూహిక వరలక్ష్మీ వ్రతం, 22న ఉదయం 10 గంటలకు సామూహిక లక్ష కుంకుమార్చన జరుగనున్నాయని కార్యనిర్వహణాధికారి ఆళ్ల శ్రీనివాసరెడ్డి బుధవారం తెలిపారు అలాగే త్వరలో నిత్యాన్నదాన పథకాన్ని ప్రారంభిస్తామన్నారు. రూ.5,116 పైబడి విరాళం అందజేసే దాత పేరున వారు కోరిన రోజున అన్నదానం చేస్తామని వివరించారు. కాగా 15, 22వ తేదీల్లో జరిగే పూజా కార్యక్రమాల్లో పాల్గొనే భక్తులకు ఉచితంగా పూజా సామగ్రి అందజేయనున్నట్లు వెల్లడించారు.

ఇన్‌స్పెక్టర్‌కు గది కేటాయించాలంటూ..

నెల్లూరు(అర్బన్): జిల్లా వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ కమ్ ఆడిటర్‌కు కలెక్టరేట్‌లో ప్రత్యేక గదిని కేటాయించాలని ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ మీడియా కార్యదర్శి మహ్మద్ హసన్‌బేగ్ కోరారు. బుధవారం డీఆర్వో హుస్సేన్ సాహెబ్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెంచీ, కుర్చీని మాత్రమే ఇన్‌స్పెక్టర్‌కు కేటాయించడం శోచనీయమన్నారు. అక్కడ బోర్డు కూడా లేదన్నారు. అందువల్ల ఇన్‌స్పెక్టర్ మైనార్టీలకు అందుబాటులో లేరన్నారు. ప్రత్యేక గదిని కేటాయించి సక్రమంగా విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నగరంలోని 42, 43, 44, 48 డివిజన్లలో సుమారు 80 నుంచి 90 శాతం మంది ముస్లింలు నివాసం ఉంటున్నారన్నారు. పరమేశ్వరినగర్ ప్రాంతంలో జుమ్మా మసీద్‌కు ఉన్న 13 ఎకరాల వక్ఫ్ భూమిలో శ్మశాన వాటికకు 5 ఎకరాలు కేటాయించాలని కోరారు.

ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకునేలా చర్యలు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని వ్యాపారాలకు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకునేలా చర్యలు చేపట్టాలని టీపీఆర్వో వాసుబాబు ఆదేశించారు. పబ్లిక్ హెల్త్ విభాగం, వార్డ్ సచివాలయ శానిటేషన్ కార్యదర్శులతో వారాంతపు సమీక్షను కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటి చెత్త సేకరణ ప్రక్రియను క్రమం తప్పకుండా చేపట్టాలన్నారు. అన్ని డివిజన్లలో 14 రోజులకు ఒకసారి ఫాగింగ్ ప్రక్రియను నిర్వహించాలన్నారు. సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలని వినతి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): చేనేత వృత్తి చేసుకునే వారికి నేత బజారును ఏర్పాటు చేసుకునేందుకు స్థలం కేటాయించాలని జిల్లా చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ అధ్యక్షుడు బాలాజీ కోరారు. ఈ మేరకు నగరంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. బాలాజీ మాట్లాడుతూ నెల్లూరు నగరంలోని గాంధీ నగర్‌లో ఆప్కోకు కేటాయించిన స్థలంలో ఇస్తే బాగుంటుందన్నారు. కార్యక్రమంలో రామనాథం రాజశేఖర్, జానపాటి రామసుబ్బయ్య, సోమా గోపాల్, సోమా అనురాధ పాల్గొన్నారు.

విద్యావ్యవస్థను మెరుగుపరచాలి

నెల్లూరు(టౌన్): రాష్ట్రంలో విద్యావ్యవస్థను మెరుగుపరచాలని ది పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్రాధ్యక్షుడు నరహరి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను బుధవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. పాఠశాల విద్యాశాఖ అధికారుల వైఖరిని ఒకసారి పరిశీలించాలన్నారు. నాలుగో తరగతి ఇంగ్లిష్ ప్రశ్నపత్రం పిల్లలు సమాధానం రాసే స్థాయిలో ఉందా అని ప్రశ్నించారు. టెక్స్ట్ బుక్స్, వర్క్ బుక్స్‌లో ఉన్న ప్రశ్నలు ఇవ్వకుండా జేఈఈలో ఇచ్చినట్లు అప్లికేషన్ టైపు ప్రశ్నలు ఇస్తున్నారన్నారు. బడుల్లో పూర్తి స్థాయిలో టీచర్లు లేరన్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వం ఇచ్చే ప్రశ్నపత్రాలను అనుసరించడం లేదన్నారు. విద్యార్థి స్థాయికి తగ్గట్టు ప్రశ్నపత్రం ఎందుకు రూపొందించడం లేదన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో శిక్షణ

నెల్లూరు(అర్బన్): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వచ్చే నెలలో ఎయిర్ కండీషన్, రిఫ్రిజిరేటర్ సెల్‌ఫోన్‌లకు సంబంధించి సర్వీసింగ్, మరమ్మతులపై పురుషులకు శిక్షణ ఇస్తున్నామని ఆ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి కల్పన శిక్షణ సంస్థ డైరెక్టర్ ఎం.కాశయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే స్త్రీలకు సంబంధించి టైలరింగ్, మగ్గం వర్క్‌లలో అక్టోబర్ నెలలో ఉచిత శిక్షణ ప్రారంభిస్తున్నామన్నారు. ఈ శిక్షణ వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో నిర్వహిస్తామన్నారు. తెలుగు చదవడం, రాయడం వచ్చి.. 18 ఏళ్ల వయసు నిండి 45 ఏళ్ల లోపున్న వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఉచిత శిక్షణతోపాటు భోజన, వసతి అవకాశం కల్పిస్తామన్నారు. వివరాలకు 94916 94560, 81860 02249, 98852 11995 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఛత్రపతి శివాజీకి నివాళి



మాట్లాడుతున్న మాధవ్

నెల్లూరు(బృందావనం): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ట్రంకురోడ్డు గాంధీబొమ్మ దగ్గర శివాజీ సెంటర్‌లో ఉన్న వరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి బుధవారం సందర్శించారు. అనంతరం ఆ సెంటర్‌లో ఉన్న ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఆయన వెంట నేతలు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, పి.సురేందర్‌రెడ్డి, పి.వంశీధర్‌రెడ్డి, వాకాటి నారాయణరెడ్డి ఉన్నారు.

⇨ వినాయకచవితి ఉత్సవాల సందర్భంగా తాత్కాలికంగా ఏర్పాటు చేసే గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్ సరఫరా కల్పించాలని విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి నిర్వాహకులు సత్యనాగేశ్వరరావు, సురేందర్‌రెడ్డి తదితరులు మాధవ్‌కు విన్నవించారు.

టీషర్టులు, టోపీల అందజేత



నెల్లూరు(టౌన్): స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో బుధవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, ఇంటర్నేషనల్ రెడ్‌క్రాస్ సహకారంతో 100 మంది వలంటీర్లకు టీషర్టులు, టోపీలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ గిరి మాట్లాడుతూ వలంటీర్లు తమ సమీప ప్రాంతాల్లో పది గృహాలను దత్తత తీసుకుని వాయు, నీటి కాలుష్యం, చెత్త వేరు చేయడం, ప్లాస్టిక్ నిషేధం, మొక్కలు నాటడం తదితర వాటిపై అవగాహన కల్పించాలన్నారు. ఈనెల 15న పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే వేడుకల్లో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో కాలేజీ క్లైమెట్ సెక్షన్ గ్రూపు కో-ఆర్డినేటర్ రంజని, సభ్యులు రమాదేవి, స్వాతి, కన్యాకుమారి, మమత, ప్రియాంక పాల్గొన్నారు.

ఉచిత బస్సు ప్రయాణానికి ఏర్పాట్లు



సిబ్బందితో మాట్లాడుతున్న షేక్ షమీమ్

నెల్లూరు సిటీ: ఈనెల 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి షేక్ షమీమ్ తెలిపారు. నగరంలోని డిపో-1లో డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లతో బుధవారం ఆమె మాట్లాడారు. ఈ పథకాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. ఫిర్యాదులు లేకుండా విధులు నిర్వహించాలన్నారు. బస్సుల కండీషన్‌ను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. అసిస్టెంట్ మేనేజర్ సునీత్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి : కమిషనర్



నీటి పారుదలను పరిశీలిస్తున్న కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు): వర్షాల నేపథ్యంలో రోడ్లపై నీరు చేరకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని కమిషనర్ వైఓ నందన్ ఇంజినీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ఎన్టీఆర్ నగర్, బాలాజీ నగర్, ఏసీ నగర్, ఆత్మకూరు బస్టాండ్ సమీపంలోని అండర్ బ్రిడ్జి, విజయ మహల్ గేటు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. కాలువలను మూసివేస్తూ చేపట్టిన నిర్మాణాలను గుర్తించిన కమిషనర్ వెంటనే వాటిని తొలగించి పూడికతీతకు అడ్డంకి లేకుండా చూడాలని ఆదేశించారు. అండర్ బ్రిడ్జీల వద్ద వర్షపు నీరు నిల్వ లేకుండా మోటార్ల సాయంతో తోడాలన్నారు. అధికారులు రామ్‌మోహన్‌రావు, హిమబిందు, ఈఈ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

⇨ నక్ష సర్వే నిర్వహణపై సమీక్షను కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో బుధవారం నందన్ నిర్వహించారు.